సాక్షి కర్నూలు

సోమవారం ; 7 ; ఆగస్టు ; 2023



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో దర్శన క్యూలైన్లు కిక్కిరిశాయి.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,627.60
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:85.324
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:12,228
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:7,994

న్యూస్‌రీల్

ముగిసిన పింఛన్ల పంపిణీ

రాష్ట్రంలో కర్నూలు జిల్లాకు 5వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో నంద్యాల జిల్లాకు 3వ స్థానం, కర్నూలు జిల్లాకు 5వ స్థానం లభించింది. కర్నూలు జిల్లాలో 2,36,089 మంది లబ్ధిదారులు ఉండగా 2,34,288 మందికి (99.24శాతం) పింఛన్లు పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,13,642 మంది లబ్ధిదారులు ఉండగా 2,12,058 మందికి (99.26 శాతం) పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లాను 5వ స్థానంలో నిలిపిన వార్డు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లను డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అభినందించారు.

నేడు జెడ్పీలో 'స్పందన'

కర్నూలు(అర్బన్): స్పందన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా స్పందన వేదికను జిల్లా పరిషత్‌కు మార్చినట్లు తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించాలన్నారు. అలాగే జిల్లాలోని డివిజన్, మండల కేంద్రాల్లోని కార్యాలయాల్లో యథావిధిగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కాలేజీల్లో చేరాలి

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల, కేవీఆర్ మహిళ, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీల్లో సీట్లు పొందిన వారు సోమవారంలోపు చేరాలని ఆయా కాలేజీ వర్గాలు తెలిపాయి. ఈ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాల్లో మొదటి విడత సీట్లు ఈ నెల 4వ తేదీన కేటాయించారు. సిల్వర్‌జూబ్లీ కాలేజీల్లో ప్రవేశాలకు ప్రత్యేకంగా సిల్వర్‌సెట్ నిర్వహించారు. మొదటి విడతలో సీట్లు పొందినా కూడా రెండో విడతలో వారు కావాల్సిన కాలేజీల్లో సీటు పొందేందుకు ఆప్షన్ పెట్టుకునేందుకు అవకాశం ఉంది.

నంద్యాల యువకులకు బంగారు పతకాలు



దుబాయ్ పవర్‌లిఫ్టింగ్ ఇన్‌చార్జితో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో నంద్యాలకు చెందిన ఇద్దరు యువకులు సత్తా చాటారు. గత నాలుగు రోజులుగా దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో 55 కేజీల విభాగంలో పవన్, 65 కేజీల విభాగంలో శ్యామ్ నాలుగు బంగారు పతకాలు సాధించారు. ఈ ఇద్దరు యువకులు స్థానిక శోభా జిమ్ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారని జిమ్ నిర్వాహకుడు కృష్ణ చైతన్య తెలిపారు. యువకులు దుబాయ్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఇండస్ వైద్యులు రూ.2.50 లక్షల సహాయం అందించారని చెప్పారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళాలు



దాత రఘునాథరెడ్డికి అమ్మవారి శేషవస్త్రాన్ని అందజేస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందించారు. నంద్యాలకు చెందిన కోమిరెడ్డి రఘునాథరెడ్డి రూ.లక్ష, అలాగే విజయవాడకు చెందిన పి.శివనాగేంద్రమణి రూ.1,11,116, రావులపాలెంకు చెందిన కె.వినయ్ శర్మ రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

గ్రామగ్రామానా శౌర్య జాగరణ యాత్ర

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ షష్ఠ్యబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 14వ తేదీ వరకు గ్రామ గ్రామానా శౌర్య జాగరణ యాత్ర నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రసార్ రాష్ట్ర కన్వీనర్ అనంత విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువుల్లో ఐక్యతను పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శౌర్య జాగరణ యాత్ర పేరుతో రథయాత్ర చేపడుతున్నామన్నారు.

హక్కు భద్రం.. పత్రాలు సిద్ధం

- ఆన్‌లైన్‌లో పల్లెల్లోని నివాసాలు, గ్రామ కంఠం స్థలాల వివరాలు
- 94 గ్రామ పంచాయతీల్లో పూర్తి అయిన డ్రోన్ సర్వే
- అందిన 74 గ్రామాల ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్
- 57 గ్రామ పంచాయతీల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి
- 41 గ్రామాల్లో ఫైనల్ ఆర్ఓఆర్ ప్రచురణ



ఏ గోనేహాల్ గ్రామంలో టేపు ద్వారా కొలతలు తీస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



సర్వే చేస్తున్న డ్రోన్ (ఫైల్)

కర్నూలు(అర్బన్): పల్లెల్లోని నివాసాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ కంఠం స్థలాలను రీ సర్వే చేసి నివాస యాజమాన్య ఆస్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకునేందుకు కూడా జిల్లా అధికార యంత్రాంగం కూడా వెనుకాడడం లేదు. ఈ నేపథ్యంలోనే సర్వే నివేదికలను రూపొందిచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ డా.జీ సృజన ఈ నెల 1వ తేదీన సస్పెండ్ కూడా చేశారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా ఆన్‌లైన్ చేస్తున్న విధంగానే ... సర్వే సెటిల్‌మెంట్ భూ రికార్డుల కమిషనర్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డ్రోన్ల ద్వారా జిల్లాల్లోని జనవాసాల్లో గ్రామ కంఠం రీ సర్వే నిర్వహిస్తున్నారు. రీ సర్వే ఎలా చేయాలనే అంశాలపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు ఆయా రెవెన్యూ డివిజన్లలో శిక్షణ కూడా ఇచ్చారు. రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో గ్రామ సభల ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించి ఎంపిక చేసిన కమిటీల ఆధ్వర్యంలో రీ సర్వే చేస్తున్నారు.

రీ సర్వేలో నమోదు చేస్తున్న అంశాలు ...

రీ సర్వేలో అనేక అంశాలకు సంబంధించి వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించి సర్వే నంబర్, యజమాని పేరు, తండ్రిపేరు, విస్తీర్ణం, సంబంధిత ఆస్తులు ఎలా సంక్రమించాయి, (పిత్రార్జితమా, కొనుగోలు చేసినవా) కొలతలు, సరిహద్దులు, యజమాని ఫోన్ నంబర్, తదితర విషయాలను నమోదు చేస్తున్నారు. రీ సర్వే నేపథ్యంలోనే జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు ఆయా గ్రామాలకు సంబంధించి ప్రత్యేకంగా మ్యాప్‌లను రూపొందించే ప్రక్రియ వేగం పుంజుకుంది.

త్వరలో హక్కు పత్రాలు ...

జిల్లాలోని గోనెగండ్ల మండలం ఐరన్‌బండ, పెద్ద కడుబూరు మండలం మేకడోణ, పీకలబెట్ట, బాపులదొడ్డి గ్రామాల్లోని ప్రజలకు త్వరలో యాజమాన్య ఆస్తి హక్కు పత్రాలను అందించేందుకు సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఆయా గ్రామాల్లో హక్కు పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.



భూ హక్కు పత్రం

హక్కు పత్రంలో ఏ వివరాలు ఉంటాయంటే ...

సర్వే, మ్యాపింగ్ పూర్తి అయిన అనంతరం ప్రభుత్వం ఆస్తుల యజమానులకు ధృవపత్రాలను జారీ చేస్తోంది. ఈ ధృవపత్రంలో యజమాని పేరు, తండ్రి పేరు, చిరునామా, గ్రామ పంచాయతీ పేరు, గ్రామ పంచాయతీ కోడ్ నెంబర్, గ్రామ సభ నిర్వహించి, తీర్మాణం చేసిన తేదీ, ఆస్తి అసైన్మెంట్ నెంబర్, నివాస గృహ వర్గీకరణ, భవన వినియోగం (గృహ/ వాణిజ్య, సంయుక్త), ఆస్తికి సంబంధించిన యూనిక్ నెంబర్, ఆస్తి సంరక్షణ వివరాలు పొందుపరచబడి ఉంటాయి.

గ్రామాల్లో రీ సర్వే పురోగతి ...

డ్రోన్ సర్వే అయిన గ్రామ పంచాయతీలు:	94
ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్) పూర్తి అయిన గ్రామాలు :	74
శాప్ ఫైల్స్ పూర్తి అయినవి :	67
గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి అయినవి :	57
గ్రౌండ్ ట్రూతింగ్ పురోగతిలో ఉన్నవి :	10
గ్రౌండ్ ట్రూతింగ్ ధ్రువీకరించినవి :	47
ధ్రువీకరణ పురోగతిలో ఉన్నవి :	10
13వ నోటిఫికేషన్ పూర్తి అయినవి :	43
ఆర్ఓఆర్ ప్రచురించిన గ్రామాలు :	41

వారంలోగా 20 గ్రామాల్లో ధ్రువీకరణ పూర్తి



వారంలోగా 20 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, ధ్రువీకరణ పూర్తి చేయాలని ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్వేకు సంబంధించి సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న మండలాలకు చెందిన తహసీల్దార్లకు జేసీ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. నాలుగు గ్రామాల్లోని ప్రజలకు అందించేందుకు యాజమాన్య ఆస్తి హక్కు పత్రాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సర్వే, నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపే విషయంలో క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఉపేక్షించేది లేదు. ఈ సర్వే వల్ల ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు వీలు కలుగుతుంది. అలాగే ఇళ్ల మధ్య ఉన్న వివాదాలు కూడా దాదాపు తగ్గిపోతాయి.

– టీ నాగరాజునాయుడు, జిల్లా పంచాయతీ అధికారి,

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు 10వ తేదీకి మార్పు

కర్నూలు(అర్బన్): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల నిర్వహణను ఈ నెల 10వ తేదీకి మార్పు చేసినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా ఈ సమావేశాలను ఈ నెల 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అదే రోజు జిల్లాలోని ఆలూరు, ఆదోని నియోజకవర్గాల అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించనున్న దృష్ట్యా స్థాయీ సంఘ సమావేశాలను 10వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

ఖాళీగా సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- 8 నుంచి నామినేషన్ల స్వీకరణ.. 19న పోలింగ్

కర్నూలు (టౌన్): జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లాలో మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం బదినేహాల్లు సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల్లో 42 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈనెల 8వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమర్పించవచ్చు. 11వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13వ తేదీ ఎన్నికల అథారిటీ అధికారికి అభ్యర్థులు తమ అభ్యర్థనలను సమర్పించవచ్చు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు. ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుంది. అనంతరం గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారు. అనుకోని ఘటనలు జరిగితే ఆయా ప్రాంతాల్లో రీపోలింగ్ ఈనెల 20వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు.

కర్నూలు రైల్వేస్టేషన్‌కు 'అమృత్' సొబగులు

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పథకాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌తో కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ సరికొత్త సొబగులు అద్దుకోనుందని కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 508 స్టేషన్లు ఈ స్కీము కింద ఎంపిక కాగా కర్నూలుకు చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. కర్నూలుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఎంపికైన రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొవ తీసుకున్నారని చెప్పారు. ఈ స్కీముతో కర్నూలు సిటీ స్టేషన్ రూపు రేఖలు మారనున్నాయని, ముఖ్యంగా అశోక్‌నగర్ వైపు రెండో ద్వారాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కర్నూలుకు మంజూరయ్యే రూ.42.62 కోట్లతో టెలికాం సౌకర్యాల కోసం రూ.70లక్షలు, మూడు లిఫ్టుల కోసం రూ.1.37 కోట్లు, ఐదు ఎస్కలేటర్ల కోసం రూ.5.54 కోట్లు, సాఫ్ట్ అప్‌గ్రేడ్ కోసం రూ.8.76 కోట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (ఎఫ్‌ఓబీ) కోసం రూ.23.20కోట్లు, దివ్యాంగుల సౌకర్యార్థం రూ.3.05 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ కర్నూలు సిటీ స్టేషన్‌ను రీ మోడలింగ్ చేయడం అభినందనీయమని చెప్పారు. కర్నూలు నగర మేయర్ బీ.వై. రామయ్య మాట్లాడుతూ కర్నూలు సిటీ స్టేషన్‌ను ఆధునీకరించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. పేద, సామాన్య ప్రయాణికులకు రైల్వే ఎన్నో సేవలందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు రేణుక, అరుణ, స్టేషన్ మేనేజరు నాగేంద్ర, ఇతర రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చకచకా 'గ్రీన్ కారిడార్' పనులు

- కందికాయపల్లె సమీపంలో ఏర్పాటు కానున్న సోలార్, పవన విద్యుత్పాదక పరిశ్రమలు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి లభించనున్న ఉపాధి



సోలార్ ప్యానెళ్లను బిగించేందుకు సిద్ధం చేసిన పోల్స్



సోలార్ ప్యానెల్ ఫిట్టింగ్‌కు అమర్చే పరికరాలు దింపుతున్న దృశ్యం

పాణ్యం: ప్రకృతి వనరులతో విద్యుత్‌ను తయారు చేసేందుకు కందికాయపల్లె గ్రామ సమీపంలో గ్రీన్ కో సంస్థ చేపడుతున్న పనులు వేగం పుంజుకున్నాయి. గతేడాది మే 17న పిన్నాపురం గ్రామంలో మూడు పునరుత్పాదక పరిశ్రమల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సోలార్, విండ్, హైడ్రో పవర్ తయారయ్యే విధంగా గ్రీన్ కో సంస్థ ఈ మూడు పరిశ్రమలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా 5,230 మెగావాట్ల విద్యుదుత్పత్తి కానుంది.

2,850 ఎకరాల్లో..

పాణ్యం మండలం ఆలమూరు రెవెన్యూ గ్రామమైన కందికాయపల్లె సమీపంలో 2,850 ఎకరాల్లో సోలార్, విండ్ విద్యుత్ ఉత్పాదన పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. 'గ్రీన్ కారిడార్' పేరుతో వీటి ఏర్పాటుకు గతేడాది ప్రభుత్వం అనుమతిచ్చింది. సోలార్ ద్వారా 700, విండ్ ద్వారా 300 మెగావాట్ల విద్యుత్‌ను తయారు చేయనున్నారు. ఇందుకు గ్రీన్ కో సంస్థ దాదాపు రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. కాలుష్య రహితంగా ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడనున్నాయి.

వెయ్యిమందికి ఉపాధి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ప్రత్యేక జీవోతో పరిశ్రమల్లో స్థానికులకే 70 శాతం మేర ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. దీంతో గ్రీన్ కో సంస్థ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు వెయ్యి మందికి ఉపాధి దొరకనుంది. చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించనున్నాయి.

భారీ యంత్రాలతో..

ప్రభుత్వం కేటాయించిన భూముల్లో పరిశ్రమలకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ముందుగా పరిశ్రమలకు కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నారు. కేటాయించిన భూముల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో పోల్స్‌ను నాటారు. వాటిపై సోలార్ ప్యానెల్ (ప్లేట్లను) బిగించనున్నారు. ఇందుకు అవసరమయ్యే పరికరాలు కూడా వచ్చాయి.

బాబు తీరుపై పెల్లుబికిన ఆగ్రహం

- పలుచోట్ల టీడీపీ అధినేత దిష్టిబొమ్మల దహనం
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- పుంగనూరు ఘటనపై మండిపడిన ప్రజాప్రతినిధులు

కర్నూలు(రాజ్‌విహార్): అన్నమయ్య జిల్లా పుంగనూరులో పచ్చమూకలు (టీడీపీ శ్రేణులు) సృష్టించిన హింసాకాండపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు నిర్వహించారు. పలుచోట్ల టీడీపీ అధినేత చంద్రబాబు దిష్టిబొమ్మలను చెప్పులతో కొడుతూ దహనం చేశారు. రాష్ట్రంలో అశాంతి నెలకొల్పి రాజకీయంగా లబ్ధి పొందాలన్నదే చంద్రబాబు లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా పుంగనూరులో జరిగిన విధ్వంసకాండకు చంద్రబాబే కారణమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో 80 శాతం మంది ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని రాష్ట్రంలో టీడీపీ నేతలు అలజడులు సృష్టిస్తున్నారన్నారు.

➡కర్నూలు నగరంలోని పాతబస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని చంద్ర బాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీ బుట్టా రేణుక, కార్పొరేటర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

➡తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారణమని, రాష్ట్రంలో అశాంతి నెలకొల్పడమే ఆయన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఆయన ఎన్ని ఎత్తులు వేసినా వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాలేదన్నారు.

➡మంత్రాలయంలోని 167 నంబరు జాతీయ రహదారిపై ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ నాయకులు సీతారామిరెడ్డి, భీంరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



కర్నూలులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

➡కోడుమూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. టీడీపీ అధినేత దిష్టిబొమ్మను దహనం చేశారు.

➡ఆలూరులోని అంబేడ్కర్ సెంటర్‌లో టీడీపీ నేత చంద్రబాబు దిష్టి బొమ్మను వైఎస్సార్ సీపీ నాయకులు దహనం చేశారు. మంత్రి సోదరులు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు ఎంపీపీ రంగమ్మ పాల్గొన్నారు.

➡కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతరెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్ రెడ్డి నిరసన కార్యక్రమం నిర్వహించారు.



తుగ్గలి మండలం పగిడిరాయిలో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కోడుమూరులో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజాస్పందన లేకనే అలజడులు

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు (అర్బన్): టీడీపీ అధినేత చంద్రబాబు యాత్రలకు ప్రజాస్పందన లేకపోవడంతో అలజడులు సృష్టిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆరోపించారు. జెడ్పీలోని తన చాంబర్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులు ఎవరి హయాంలో వచ్చాయో, అభివృద్ధి చెందాయో తెలుసుకుని చంద్రబాబు యాత్రకు ఆ పార్టీకి చెందిన నేతలే దూరంగా ఉన్నారన్నారు. ఓ వైపు సొంత పార్టీ వారు రాకపోవడం, మరో వైపు ప్రజా స్పందన లేకపోవడంతో ఆందోళనకు గురైన చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలతో పుంగనూరులో పోలీసులపై దాడులు జరిపించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కుప్పంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీన్ని చూసి తట్టుకోలేక పుంగనూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పోలీసులపై దాడులు జరిపారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని, అధికారం కోసం విధ్వంసాలకు పాల్పడటం మంచిది కాదన్నారు.

క్లుప్తంగా

బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు నేడు ప్రత్యేక డ్రైవ్

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల(2022-23) మంజూరు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాఠశాల/కళాశాలల అధికారులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరిగా చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి/నోడల్ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల బయోమెట్రిక్ అథెంటికేషన్ కోసం ఈనెల 7న ఉదయం 10 గంటలకు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓర్వకల్లు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లోని పాఠశాలలు/కళాశాలల అధికారులు వారి ఆధార్ కార్డు లింక్ సెల్ నంబర్, ఎన్ఎస్‌పీ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ తీసుకుని ఆధార్ అథెంటికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 98854 88088, 9848864449లో సంప్రదించాలన్నారు.

అనుమానం పెనుభూతమై..

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

బొమ్మలసత్రం: అనుమానంతో భార్యను కట్టుకున్న భర్త దారుణంగా హత్య చేశాడు. నంద్యాల మండలం కానాల గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. తాలూకా సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. కానాల గ్రామానికి చెందిన బాల ఆంటోని, లక్ష్మీదేవి (36)కి దాదాపు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆంటోని మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతను విస్మరించాడు. ఈ క్రమంలో తరచూ భార్యాభర్త ఘర్షణ పడేవారు. లక్ష్మీదేవి గ్రామంలో మరో వ్యక్తితో చనువుగా ఉండటంతో బాల ఆంటోని ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భార్య తలపై గొడ్డలితో నరికాడు. దీంతో లక్ష్మీదేవి మెదడు ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు తాలుకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మీదేవి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం

- కర్నూలు జెడ్పీ, నంద్యాల కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాల ప్రదర్శన

కర్నూలు(అగ్రికల్చర్): స్వాతంత్య్ర ఉద్యమంలో చేనేత కీలక పాత్ర వహించింది. దేశాన్ని గుప్పిట్లో పెట్టుకున్న అంగ్లేయులు అక్కడ ఉత్పత్తి చేసిన వస్త్రాలను భారతదేశంలో మార్కెటింగ్ చేసుకునేందుకు యత్నించారు. ఆ సమయంలో విదేశీ వస్త్రాలకు వ్యతిరేకంగా పుట్టిందే చేనేత వస్త్రాల తయారీ. 1905 ఆగస్టులో స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి భారతీయులంతా స్వదేశీ వస్త్రాలను తమకుతామే తయారు చేసుకోవడం చేపట్టారు. వాటిని ధరించే స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ రకంగా దేశ స్వాతంత్య్రోద్యమానికి ఊపిరి.. దేశ సంస్కృతికి ప్రతీకగా నూలు వడికే రాట్నం నిలిచింది. మహాత్మాగాంధీ స్వయంగా రాట్నం తిప్పి నూలు వడికారు. దేశానికి స్వాతంత్య్ర సముపార్జనలో చేనేత వస్త్రం ఒక సాధనంగా నిలిచింది. ఇందుకు గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 7 వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు ఈ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. చేనేతలో అద్భుతంగా రాణిస్తున్న వారిని సత్కరించనున్నారు. ఆప్కో ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాపరిషత్, నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాల కౌంటర్లు ఏర్పాటు చేయ నున్నట్లు చేనేత జౌళి శాఖ ఏడీ హరికృష్ణ తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు 'నవోదయం'

- ఈనెల 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 2024 జనవరి 20న ప్రవేశ పరీక్ష



బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం

ఎమ్మిగనూరు: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1986 జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి అప్పట్లో దేశ వ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సమీపంలోని బనవాసిలో ఈ విద్యాలయాన్ని నిర్మించారు. ఈ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశాల కోసం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 10లోగా ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. 2024 జనవరి 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

ఉత్తమ విద్యాబోధన..

జవహర్ నవోదయ విద్యాలయంలో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయటంతోపాటు సమైక్యతాభావాన్ని పెంపొందిస్తున్నారు. ప్రతియేటా నవోదయలో 6, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహిస్తారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశ పరీక్షల కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 80 సీట్లకు విద్యార్థులు పోటీ పడాల్సి ఉంటుంది.

అర్హతలు ఇవే..

నవోదయ విద్యాలయాలల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షను ఒక్కసారి మాత్రమే రాయాల్సి ఉంటుంది. కర్నూలు ,నంద్యాల జిల్లాల్లోని అన్ని మండలాల్లో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. 2024-25 విద్యాసంవత్సరం కోసం 6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2012 మే 1వ తేదీ నుంచి 2014 జూలై 30 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి చేసి ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి. గతంలో ప్రవేశపరీక్షకు హాజరైన వారు అనర్హులు.

రిజర్వేషన్లు ఇలా..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణాల్లోని పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలబాలికలకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. బాలికలకు 33 శాతం కోటా అమలులో ఉంటుంది. షెడ్యూల్డ్ కులాలకు 15శాతం, షెడ్యూల్డ్ తరగతులకు 7 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష కోసం తమ పాఠశాలల్లో విద్యాబోధనతోపాటు కోచింగ్ సెంటర్‌లలో ప్రత్యేక శిక్షణ తీసుకొంటుంటారు. కష్టపడి చదివిన వారికే తప్పక సీట్లు వస్తాయి.

ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు

దరఖాస్తులను ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలు, జిల్లా విద్యాశాఖాధికారుల కార్యలయాలు, ఏపీ సమగ్ర శిక్షణా కార్యాలయల్లో పొందవచ్చు. ఆన్‌లైన్‌లో జవహర్ నవోదయ వెబ్‌సైట్(జ్టీఃటు// ఛిఃఠిుజ్ఛీరుఃటు ఃటఛిజీ . జౌటి. జీ/ ఎుఃఠిటు/)లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు ఈనెల 10లోగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రవేశ పరీక్ష ఇలా ఉంటుంది..

నిర్దేశించిన పరీక్ష కేంద్రాల్లో 2024 జనవరి 20వతేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఒకదాన్ని విద్యార్థుల ఎంపిక చేసుకోవాలి. ప్రవేశ పరీక్షలో 100మార్కులు ఉంటాయి. ఆబ్జెక్టివ్ చాయిస్ ద్వారా నిర్వహించే ప్రవేశ పరీక్షలో మూడు విభాగాల కింద ప్రశ్నలు ఉంటాయి. మేధాశక్తిపై 50 , తెలుగు, గణితం విభాగాల్లో ఒక్కోదానికి 25 చొప్పున 50 ప్రశ్నలు ఉంటాయి. ఎంపిక విధానం పారదర్శకంగా ఉంటుంది. పరీక్ష పత్రాల రూపకల్పన, విద్యార్థుల ఎంపిక మొత్తం సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు 6,7 తరగతులను తెలుగు,ఇంగ్లిష్ మీడియాల్లో బోధిస్తారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకూ సీబీఎస్ఈ పద్ధతిలో ఇంగ్లిష్‌లో మాత్రమే బోధన ఉంటుంది.

విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం



జవహర్ నవోదయ విద్యాలయంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన ఉంటుంది. ఉచిత విద్య, వసతి అందుతుంది. బాలబాలికలకు ఉమ్మడిగా విద్యాబోధన ఉంటుంది. వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందేందుకు క్రీడలు, వ్యాసరచన,వ కృత్వపోటీలు, సమకాలిన అంశాలపై చర్చలు నిర్వహిస్తున్నాం. జేఈఈ, నీట్ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నాం.

– సాగరిక, ప్రిన్సిపాల్, బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం

కృత్రిమ అవయవాలకు కొలతల స్వీకరణ


కృత్రిమ అవయవాలకు కొలతలు స్వీకరిస్తున్న వైద్య నిపుణులు

కర్నూలు కల్చరల్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీకి భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొలతలు స్వీకరించారు. బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ తిరుపతి ప్రాంత సేవా ప్రముఖ్ రేగూరు బాలకృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగుల పునరావాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రమాదవశాత్తు, దీర్ఘరోగాలతో కాళ్లు పోగొట్టుకున్న, పోలియో దివ్యాంగులైన వారికి నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. తొమ్మిది సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరుగుతోందన్నారు. వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి 130 మంది దివ్యాంగులకు ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీకి స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. బీవీపీ తిరుపతి ప్రాంత అధ్యక్షులు బీవీ బాలసుబ్రహ్మణ్యం, కర్నూలు శాఖ అధ్యక్షులు లక్ష్మణ స్వామి, కార్యదర్శి బైరెడ్డి చిరంజీవి రెడ్డి, కోశాధికారి గుండా సతీష్‌కుమార్, యోగా గురువు దత్తయ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీస్ ఫోకస్

- ఇందిరమ్మ గృహాల్లో కార్డెన్ సెర్చ్


ఇందిరమ్మ గృహాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్ సర్కిల్ పరిధిలోని ఇందిరమ్మ గృహాల్లో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నివాసం ఉంటున్న వారి ఆధారాలు పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఉంటే వాటి రికార్డులను చూపిస్తేనే వదిలారు. కొత్త వ్యక్తులు ఎవరైనా ఉంటున్నా? అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పల్పడుతున్నారా? అనే కోణంలో విచారణ జరిపారు. తనిఖీల్లో 25 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. వాటి వివరాలు సంబంధిత రికార్డులు స్టేషన్‌లో చూపించి తీసుకెళ్లాలని సూచించారు. పూర్తి వివరాలను తీసుకున్నాకే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సెప్టెంబర్ 18 నుంచి గణేష్ ఉత్సవాలు



మాట్లాడుతున్న నాగఫణిశాస్త్రి

కర్నూలు కల్చరల్: నగరంలో గణేశ్ ఉత్సవాలు సెప్టెంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని కర్నూలు విభాగ్ (ఉమ్మడి కర్నూలు జిల్లా) గణేష్ ఉత్సవ సమితి జిల్లా సంఘటనా కార్యదర్శి ఎం .నాగఫణిశాస్త్రి తెలిపారు. ఆదివారం వినాయక ఘాట్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయం సమావేశ మందిరంలో కర్నూలు విభాగ్ ఉత్సవ సమితుల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ హితంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. విగ్రహాల ఎత్తులో పోటీ పడకుండా సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాల నిర్వహణకు పోటీ పడాలని సూచించారు. సంప్రదాయ వాయిద్యాలను ఉపయోగించాలన్నారు. అనంతరం ఉత్సవ సమితి నూతన కమిటీని ప్రకటించారు. గణేష్ ఉత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులుగా కె.క్రిష్టన్న, ప్రధాన కార్యదర్శిగా జోగయ్య శర్మ, జిల్లా కార్యాధ్యక్షులుగా సందడి సుధాకర్, నగర అధ్యక్షులుగా డాక్టర్ మోక్షేశ్వరుడు, నగర ప్రధాన కార్యదర్శిగా బి.వేణుగోపాల్, నగర కార్యాధ్యక్షులుగా సి.వి. నారాయణరెడ్డిని ప్రకటించారు.

'సహకార' ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి


డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కర్నూలు జిల్లా యూనిట్ మహాజనసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సంఘ వ్యవస్థాపకులు ఏవీ కొండారెడ్డి చిత్రపటానికి పూలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో మహాజనసభ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకులు నారాయణరెడ్డి, కేవీఎస్ రవికుమార్ తదితరులు మాట్లాడుతూ... బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, డిమాండ్‌లను చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. చైర్‌పర్సన్ విజయమనోహరి మాట్లాడుతూ... జిల్లా సహకార కేంద్రబ్యాంకును అభివృద్ధిలోకి తీసుకరావడంతో బ్యాంకు ఉద్యోగులే కీలకమన్నారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు, డిమాండ్‌లను పరిశీలించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయమనోహరిని అసోసియేషన్ నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ నంద్యాల రీజినల్ మేనేజర్ శివలీల, డీజీఎం సునీల్‌కుమార్, అసోసియేషన్ నాయకుడు విజయసింహారెడ్డి, పలువురు మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బుగ్గన ఉమ్మడి జిల్లాలో పర్యటన

డోన్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈనెల 8వ తేదీ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8వ తేదీన నంది కొట్కూరు నియోజకవర్గంలో పారుమంచాల గ్రామంలో ఆర్‌అండ్‌బీ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం నంద్యాలకు చేరుకొని ఐఏబీ సమావేశంలో పాల్గొంటారు. 9న డోన్ మండలంలోని కొత్తకోట ఎన్‌హెచ్ 44 నుంచి కొత్తబురుజు గ్రామం వరకు నిర్మించిన పీఆర్ రోడ్డును ప్రారంభిస్తారు. ఇదే రోజు రాత్రి డోన్ పట్టణంలో జరిగే వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 10న బేతంచెర్ల అర్బన్ హెల్త్ క్లినిక్‌తో పాటు ఉర్దూ స్కూల్‌ను ప్రారంభిస్తారు. 11వ తేదీన ఆదోని పట్టణంలో నిర్వహించే ఆదోని, ఆలూరు నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలో పాల్గొంటారు. అనంతరం అనంతపురం జిల్లా తాడిపత్రికి చేరుకొని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. 12న ప్యాపిలి మండలం మునిమడుగు, అలేబాద్ తండా పీఆర్ రోడ్డుతో పాటు అలేబాదు, గార్లదిన్నె రహదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తారు.



రంగులు మార్చిన రాజకీయ వి'చిత్రం'

ప్రజల కోసమో.. సిద్ధాంతాల కోసమే పార్టీలు మారే వారిని చూసుంటాం. ప్రాంతాల అభివృద్ధి కోసం సరికొత్త జెండాలను ఎత్తుకునే వారిని గమనించి ఉంటాం. అయితే ఇందుకు విరుద్ధంగా పదవుల కోసమే పార్టీలు మారుతూ 'టీజీ' అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు నిదర్శనంగా ఫ్లెక్సీ ఒకటి కర్నూలు నగరంలో ఆదివారం దర్శనమిచ్చింది. టీజీ వెంకటేష్‌కు బీజేపీకి చెందిన కాషాయి రంగు, టీజీ భరత్‌కు టీడీపీకి చెందిన పసుపు రంగు అద్ది రంగులు మార్చిన రాజకీయ చిత్రాన్ని ఫ్లెక్సీలో ఆవిష్కరించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

చురుగ్గా ఓటరు జాబితా సవరణ

- ఇంటింటా తిరిగి పరిశీలన చేస్తున్న బీఎల్‌ఓలు
- జూలై 21 నుంచి ఇప్పటి వరకు 86,953 ఇళ్లలో పరిశీలన పూర్తి
- కొత్తగా ఓటరు నమోదు కోసం 4,982 దరఖాస్తులు
- 21వ తేదీ వరకు కొనసాగనున్న ఎస్ఎస్ఆర్-2024


ఆలూరు నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-4 ఎస్‌డీసీ మల్లికార్జునుడు

కర్నూలు(సెంట్రల్): ఓటరు సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాను పరిశీలిస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదు, చనిపోయిన వారిని తొలగించడం, మార్పులు, చేర్పులు, తప్పొప్పుల సవరణ తదితర పనుల కోసం ఓటర్ల నుంచి బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

86 వేల ఇళ్లలో ఓటరు పరిశీలన పూర్తి..

2023 ప్రత్యేక ఓటరు సవరణ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 8,03,533 ఇళ్లలో 19,40,628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,65,685 మంది పురుష ఓటర్లు కాగా, 9,74,649 మంది మహిళా ఓటర్ల ఉన్నారు. పురుష ఓటర్ల సంఖ్యతో పోల్చుకుంటే మహిళల ఓటర్లసంఖ్య 8,964 ఎక్కువగా ఉంది. జిల్లాలో 2,184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పాత ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణతోపాటు కొత్త ఓటర్ల చేరిక కోసం జూలై 21వ తేదీ ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాలో 86,953 ఇళ్లలో ఓటరు జాబితా పరిశీలన పూర్తి కాగా, 2,12,848 మంది ఓటర్లను బీఎల్‌ఓలు కలుసుకున్నారు.

సవరణల కోసం దరఖాస్తుల స్వీకరణ...

ఓటరు జాబితా సవరణలో భాగంగా కొత్త ఓటర్ల చేరిక, మార్పులు, చేర్పులు కోసం ప్రజల నుంచి బీఎల్‌ఓలు భారీగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 14,340 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6 కింద 4,982, ఓటరు డిలిషన్ కోసం 2,082, మార్పులు, చేర్పుల కోసం 7,276 దరఖాస్తులు వచ్చాయి. వీటిని బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు.

యువతీ, యువకులకు సదావకాశం

18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి భారత ఎన్నికల సంఘం సదావకాశాన్ని కల్పించింది. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకుబీఎల్‌ఓలు తమ పోలింగ్‌కేంద్రం పరిధిలోని ఇళ్లలో ఇంటింటా పరిశీలన చేసి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పిస్తారు. ఈ క్రమంలో మరో 16 రోజులపాటు కొనసాగనున్న ప్రత్యేక ఓటరు సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని18 ఏళ్లు నిండిన ఓటర్లు సద్వినియోగంచేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి

ప్రత్యేక ఓటరు సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి భారత ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకొంటోంది. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లును జిల్లా ఎన్నికల అధికారిగా ప్రకటించింది. అంతేకాక ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించింది.ఈ క్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో చురుగ్గా పాల్గొని బీఎల్‌ఓలకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చి సవరణ కార్యక్రమాన్ని వేగవంతంచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు సవరణ కార్యక్రమంపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు తీసుకోవడానికి వారితోనూ సమావేశం అవుతున్నారు. తప్పులు లేని ఓటరు జాబితా కోసం ప్రతి రాజకీయ పార్టీ పోలింగ్ స్టేషన్ల వారీగా ఏజెంట్లను నియమించుకొని ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రజలు సహకరించాలి

జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు కొనసాగే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమానికి జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా 2,184 మంది బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాపై పరిశీలన చేస్తున్నారు. జాబితాలో పేర్ల మార్పు, అడ్రస్ మార్పు, తొలగింపు, ఫొటో మార్పిడి, మరణించిన వారిని తీసివేయడం జరుగుతుంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి.

– ఎస్వీ నాగేశ్వరరావు, డీఆర్వో

అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రకటన

ప్రత్యేక ఓటరు నమోదు సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 26వ తేదీనాటికి అభ్యంతరాల పరిశీలనను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18,19 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించి ఓటర్ల నుంచి అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై ఫిర్యాదుల, సలహాలు,సూచనలను స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 2184 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు.